సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



రాజన్నా.. నీవే దిక్కు

వేములవాడ: శ్రావణమాసం కొనసాగుతుండడంతో రాజన్న దర్శనానికి గురువారం సైతం 15 వేల మంది భక్తులు వచ్చారు. ఆలయ ఆవరణ భక్తులతో కిటకిటలాడింది.



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్నకు చెందిన 20 కోడెలను వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని శ్రీమంజునాథ గోశాలకు గురువారం అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
27.0/24.0

వాతావరణం

జిల్లాలో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కృష్ణ మందిరంలో ఎస్పీ దంపతుల పూజలు



కృష్ణ మందిరంలో ఎస్పీ దంపతుల పూజలు

సిరిసిల్ల: సిరిసిల్లలోని శ్రీకృష్ణధ్యాన మందిరంలో గురువారం రాత్రి ఎస్పీ అఖిల్ మహాజన్ దంపతులు పూజలు చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా సతీసమేతంగా కృష్ణ మందిరానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాడి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, కోశాధికారి పబ్బ నాగరాజు, ఆర్యవైశ్య సంఘం ముఖ్యులు ఎల్లంకి ఆనందం, ఎల్లంకి భాస్కర్, చేపూరి బుచ్చయ్య, కటుకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే బీఆర్‌ఎస్ ధ్యేయం



కనగర్తిలో ప్రొసీడింగ్స్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మండలంలోని కనగర్తిలో రెడ్డి సంఘం భవన నిర్మాణానికి రూ.3 లక్షల ప్రొసీడింగ్స్ అందించి, పనులు ప్రారంభించారు. అరుణ మాట్లాడుతూ కోనరావుపేట మండలంలో ఇప్పటి వరకు రూ.5 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సర్పంచ్ అనుపాటి భారతి, మార్క్‌ఫెడ్ చైర్మన్ బండ నర్సయ్య, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు రావులపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దొడ్డ రాజిరెడ్డి, నాయకులు శంకరవ్వ, పుట్ట గోపాల్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మిడ్‌మానేరులో 20 టీఎంసీలు



మిడ్‌మానేరు ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు ఐదు గేట్ల ద్వారా గురువారం ఎల్‌ఎండీకి 14,800 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి 17,500 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 20.21 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



అంబేడ్కర్‌చౌక్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

సిరిసిల్లటౌన్: ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె గురువారం సైతం కొనసాగింది. చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషాలు వేయించి ప్రభుత్వం తమపై కరుణ చూపాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. దీక్షా శిబిరంలో సాయంత్రం వరకు భజనలు చేస్తూ నిరసనలు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యూం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్, నీరజ, శ్రీనివాస్, సలీం, నరేశ్, వెంకటస్వామి, ఉపేందర్ ఉన్నారు.

నెల రోజులుగా మాజీ సర్పంచుల దీక్షలు



సిరిసిల్లలో మాజీ సర్పంచుల దీక్షలు

సిరిసిల్లటౌన్: మాజీ సర్పంచులు చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి నెల రోజులకు చేరాయి. ఈసందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ తమ సమస్యను పరిష్కరించే దాక విశ్రమించేది లేదన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. దీక్షల్లో బొడ్డు దేవయ్య, సంపునూరి మల్లేశంగౌడ్, అలువాల లక్ష్మణ్, దేవుని నర్సయ్య, గోవర్ధన్, సత్యనారాయణ రెడ్డి, పైలూరి రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.







ఉత్సాహంగా తీజ్

సిరిసిల్లకల్చరల్: తీజ్ ఉత్సవాలు జిల్లా కేంద్రంలో గురువారం ఉత్సాహంగా సాగాయి. తొమ్మిది రోజులపాటు యువతులు నిష్ఠతో పెంచిన గోధుమ నారుతో ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారి నృత్యాలు ఆకట్టుకున్నాయి. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కాంగ్రెస్ నాయకుడు సంగీతం శ్రీనివాస్, హిందూ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పత్తిపాక సురేశ్, ఉత్సవ నిర్వాహకులు రాంరెడ్డి, గజన్‌లాల్, మోతీలాల్, భూపతి, గోపి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణం వందే జగద్గురుం

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రం మెహర్‌నగర్‌లోని కృష్ణ మందిరంలో గురువారం నిర్వహించిన వేడుకలు కనులపండువగా సాగాయి. సాయంత్రం మొదలైన వేడుకలు రాత్రి వరకు ఉల్లాసంగా కొనసాగాయి. చిన్నికృష్ణులు ఉట్టి కొట్టేందుకు పోటీపడగా.. ఆలయానికి వచ్చిన భక్తులు వారిని ప్రోత్సహించారు. ఊయల సేవతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. సిరిసిల్ల పట్టణ సీఐ ఉపేందర్, ఆలయ కమిటీ పెద్దలు చేపూరి బుచ్చయ్య, కొత్తపల్లి శ్రీనివాస్, పబ్బ నాగరాజు, ఉప్పల విఠల్‌రెడ్డి, భారీ సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



సిరిసిల్ల ట్రెయిన్ 21 కి.మీ దూరంలో ఉన్నది!

- వడివడిగా మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే లైన్ పనులు
- ఇటీవల సిద్దిపేట వరకు వచ్చిన రైలు
- త్వరలో సిరిసిల్ల, గుర్రాలగొంది, చిన్నలింగాపూర్‌లో స్టేషన్లు
- ప్లాట్‌ఫామ్స్, భవనాలు, గదుల నిర్మాణానికి టెండర్లు
- ఏడాదిలోగా పూర్తి చేసేందుకు చర్యలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో రైల్వే పనులు ఊపందుకున్నాయి. కొత్తపల్లి– మనోహరాబాద్ లైన్ పనులు వడివడిగా సాగుతున్నాయి. ఈ మార్గంలో ఇప్పటికే సిద్దిపేట వరకు రైలొచ్చింది. మిగిలిన రూట్లలోనూ పనులు స్పీడందుకున్నాయి. సిద్దిపేట తర్వాత గుర్రాలగొంది, చిన్నలింగాపూర్, సిరిసిల్ల స్టేషన్ల నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే టెండర్లు జారీ చేసింది. ప్లాట్‌ఫాంలు, భవనాలు, గదులు, అప్రోచ్ రోడ్లు, లైటింగ్, విద్యుత్ యార్డు తదితర పనుల కోసం టెండర్లు జారీచేశారు. మొత్తం టెండరు విలువ రూ.5,30,27,277గా అధికారులు పేర్కొన్నారు. ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటలకు టెండరు ముగింపు గడువుగా తెలిపారు. పనులు ఏడాదిలోగా పూర్తి చేయాలని టెండరులో సూచించారు.

21 కి.మీల దూరంలో పాత కరీంనగర్

సిరిసిల్ల–సిద్దిపేట మధ్యలో 30 కి.మీ దూరానికి ట్రాక్ వేసేందుకు దాదాపు రూ.440 కోట్ల వ్యయంతో జనవరిలోనే దక్షిణ మధ్య రైల్వే బిడ్డింగులు పిలిచింది. తాజాగా సిరిసిల్ల, గుర్రాలగొంది, చిన్నలింగాపూర్‌లలోనూ స్టేషన్ నిర్మాణాలకు దక్షిణ మధ్య రైల్వే టెండర్లు పిలవడంతో ఈ మార్గంలో జరుగుతున్న పనుల వేగానికి నిదర్శనం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను హైదరాబాద్‌తో కలిపే కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైను ప్రస్తుతం సిద్ధిపేట వరకు పూర్తయింది. ఇటీవల సిద్దిపేటను రైలు కూడా పలకరించింది. సిద్దిపేట తర్వాతి స్టేషన్ గుర్రాలగొంది కేవలం 10 కి.మీ దూరంలో ఉంటుంది. గుర్రాలగొంది– చిన్నలింగాపూర్ మధ్య దూరం 11 కి.మీ. చిన్నలింగాపూర్–సిరిసిల్ల మధ్య 9 కి.మీ దూరం వస్తుంది. గుర్రాలగొంది సిద్దిపేట జిల్లా కాగా, చిన్నలింగాపూర్ సిరిసిల్ల జిల్లాలో ఉంటుంది. ఈ లెక్కన కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే మార్గం పాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రవేశించేందుకు కేవలం 21.కి.మీల దూరంలో ఉంది.

77 కి.మీ మేర పూర్తయిన మార్గం..

మనోహరాబాద్–కొత్తపల్లి (కరీంనగర్) వరకు మొత్తం 151.36 కిలో మీటర్లు బ్రాడ్‌గేజ్‌లైన్. ఈ మార్గంలో ప్రస్తుతం సిద్దిపేట స్టేషన్ (77కి.మీ) వరకు లైన్ పూర్తయింది. ఇక్కడి నుంచి దాదాపు 30 కి.మీ దూరంలో ఉన్న సిరిసిల్ల స్టేషన్ (106.88 కి.మీ) వరకు ప్రస్తుతం పనులు వేగంగా నడుస్తున్నాయి. అక్కడ నుంచి కరీంనగర్ వరకు (151.36 కి.మీ) అంటే దాదాపు 44.48 కి.మీ వరకు ట్రాక్ పనులు సాగాలి. ఇవి 2025 మార్చి వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సిరిసిల్లలో కావాల్సిన భూసేకరణకు అధికారులు ఇప్పటికే పచ్చజెండా ఊపారు. దక్షిణ మధ్యరైల్వే అడిగిన భూమిని అటవీ భూమిని ఇచ్చేందుకు ఇటీవల సిరిసిల్ల కలెక్టర్ అనుమతించారు. భూసేకరణ విషయంలో రైల్వే అధికారులతో సిరిసిల్ల–కరీంనగర్ కలెక్టర్లు కూడా పలుమార్లు సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ మార్గం పూర్తయితే జగిత్యాల, పెద్దపల్లి వాసులకు ఢిల్లీ, హైదరాబాద్ వెళ్లేందుకు రైలు ప్రయాణం అందుబాటులోకి వస్తుంది.

కొత్తపల్లి–మనోహరాబాద్ మార్గం విశేషాలు

- మార్గంలో విస్తరించి ఉన్న జిల్లాలు: సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్
- మార్గాన్ని ఆనుకొని ఉన్న గ్రామాలు: 70
- ఈ రూట్‌లో మొత్తం రైల్వే స్టేషన్లు :15
- పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలు: వేములవాడ, కొమురవెల్లి, కొండపోచమ్మ, నాచారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలు.
- మొత్తం పొడవు : 151.36 కి.మీ.
- మెదక్ జిల్లాలో : 9.30 కి.మీ.
- సిద్దిపేట జిల్లాలో : 83.40 కి.మీ.
- రాజన్నసిరిసిల్లా జిల్లాలో: 37.80 కి.మీ.
- కరీంనగర్ జిల్లాలో : 20.86 కి.మీ.
- ఇప్పటి వరకూ పూర్తయిన మార్గం : 77 కి.మీ

ప్రాజెక్టు నేపథ్యం ఇదీ..

వేములవాడ, సిరిసిల్ల, సిద్దిపేట ప్రజలకు రైలు ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో 2006–07లో 151 కి.మీ కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వే లైన్ కోసం రూ.1,167 కోట్ల అంచనా వ్యయం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. తర్వాత ఈ మార్గం ఆర్థికంగా భారమని చెప్పి రైల్వేశాఖ సుముఖత చూపలేదు. మొత్తం బడ్జెట్‌లో 1/3 వంతు ఖర్చుతోపాటు 100 శాతం భూమిని సేకరించి ఇవ్వడం, ఈ మార్గంలో ఐదేళ్లపాటు వచ్చే నష్టాలను భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకువచ్చింది. దీంతో 2016లో ఈ ప్రాజెక్టు తిరిగి పట్టాలెక్కింది. ఈప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి(వేములవాడ): ప్రజాఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంతోపాటు చందుర్తి పోలీసు స్టేషన్‌ను, పరిసర ప్రాంతాలను గురువారం పరిశీలించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ నేరాల పరిశోధనలో సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలను మెరుగుపరచుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పాతనేరస్తులు, వివాదాస్పదుల కదలికలపై నిఘా పెంచాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఠాణాలో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీఐ అచ్చ కిరణ్‌కుమార్, ఎస్సై సిరిసిల్ల అశోక్ ఉన్నారు.



రిసెప్షన్ కౌంటర్ పరిశీలిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల వైపు ఎస్వీ రెడ్డి చూపు !

- టీపీసీసీ పెద్దలతో మంతనాలు

సిరిసిల్ల: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఇంకా కసరత్తు చేస్తున్నాయి. ఆ పార్టీల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు ఎవరు అనే సందిగ్ధం కొనసాగుతుంది. సిరిసిల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు దుబాయ్‌లో టీపీసీసీ ఎన్నారై విభాగం కన్వీనర్‌గా పనిచేస్తున్న ఎస్.వీ.రెడ్డి(శ్రీరాం వేణు రెడ్డి) ఆసక్తి చూపుతున్నారు. ఈమేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి ముఖ్యనాయకులను సంప్రదించినట్లు తెలిసింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన ఎస్వీ రెడ్డి దశాబ్దకాలంగా దుబాయ్‌లో ఉంటున్నారు. దుబాయ్‌లో ఇబ్బందులు పడే తెలంగాణ వలసకార్మికులకు అండగా నిలుస్తున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలోనూ సొంత ఖర్చులతో పలువరికి విమాన టిక్కెట్లు సమకూర్చారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు దుబాయ్‌కి డెలిగేట్‌గా వెళ్తే ఎస్.వీ.రెడ్డిని కలుస్తారు. ఎన్నారై విభాగంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడంలోనూ ముందున్నారు. ఈ నేపథ్యంలో సిరిసిల్ల ప్రాంతంలో ఆయనకు పరిచయాలు.. బంధుత్వాలు ఉండడంతో ఇక్కడ పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఆ పార్టీ నుంచి బరిలో నిలిచేందుకు కె.కె.మహేందర్ రెడ్డి, చీటీ ఉమేశ్‌రావు, సంగీతం శ్రీనివాస్, నాగుల సత్యనారాయణగౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో దుబాయ్‌కి చెందిన ఎన్నారై కూడా సిరిసిల్ల బరిలో నిలిచేందుకు ముందుకు రావడం విశేషం. పార్టీ అవకాశం ఇస్తే ఇక్కడ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎస్.వీ.రెడ్డి గురువారం తెలిపారు.



శ్రీరాం వేణురెడ్డి

ముస్తాబాద్‌లో నకిలీ రశీదుల కలకలం

- అధికారుల జేబుల్లోకి రూ.1.20 లక్షలు

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రజలు చెల్లించే పన్నులకు ఎసరు పెట్టిన వైనం ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో ఆలస్యంగా వెలుగుచూసింది. ముస్తాబాద్ మేజర్ పంచాయతీ అధికారులు నకిలీ రశీదు బుక్కులు ప్రింట్ చేయించి, వసూలు చేసిన పన్నులను కాజేశారు. అయితే పంచాయతీకొచ్చే ఆదాయం తగ్గడంతో సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు అనుమానం వచ్చి.. పదిహేను రోజుల క్రితం జరిగిన పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో రశీదు బుక్కులను పరిశీలించారు. ప్రస్తుతం 15000 పై సీరియల్ నంబర్ గల రశీదులు చెలామణిలో ఉండగా.. 001 నుంచి రశీదులు ఇవ్వడంపై అనుమానం వచ్చింది. దీనిపై ఆరా తీయగా నకిలీ బుక్కులు ప్రింట్ చేయించి, పన్నులు పక్కదారి పట్టిస్తున్న విషయం వెలుగుచూసింది. గత ఫిబ్రవరిలో రశీదుబుక్కులు జారీచేయగా.. ఎంపీవో సంతకం లేకుండానే రశీదు బుక్కులు వాడుతున్నారు. ఎంపీవో రిజిస్టర్‌లో నమోదు చేయకుండా, పంచాయతీ కార్యదర్శి నకిలీ రశీదు బుక్కులను ప్రింట్ చేయించారని పాలకవర్గ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇలా ఏకంగా రూ.1.20లక్షల వరకు వసూలు చేసిన పన్నుల డబ్బులను పక్కదారి పట్టించారని వారు పేర్కొంటున్నారు. కొత్త ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల విషయంలో పెద్దమొత్తంలో అధికారులు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జమ, ఖర్చు, లాగ్, ఇర్సాల్, క్యాష్‌బుక్కుల రికార్డులపై విచారణ చేయాలని వార్డు సభ్యులు కోరుతున్నారు. ఈ విషయంపై సర్పంచ్ సుమతి మాట్లాడుతూ నకిలీ రశీదుల బుక్కులు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణాధికారిగా మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ విచారణ చేస్తున్నారని, కలెక్టర్‌కు త్వరలో ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని వివరించారు.

జగ్గారావుపల్లె చదివింది !

- తొమ్మిదేళ్ల కిందట వెలిగిన అక్షరదీపం
- వయో'జనులకు' రాత్రి బడి చదువులు
- పోలీసుల ప్రోత్సాహం.. పల్లెజనం ఉత్సాహం
- వేలిముద్రలు లేని జగ్గరావుపల్లి

సిరిసిల్ల: ఆ పల్లెలో అక్షరదీపం వెలిగింది. ఆరుపదుల వయసులో పలక, బలపం పట్టి అక్షరాలు దిద్దారు. వేలిముద్రలు వేసేవాళ్లంతా అంకెలు నేర్చుకొని ఫోన్‌నంబర్లు రాస్తున్నారు. ఆ పల్లెలో రాత్రిబడి అక్షర వెలుగులు నింపింది. జిల్లాకేంద్రం సమీపంలోని జగ్గరావుపల్లెలో ఊరంతా సంతకాలు నేర్చుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్షర పథకాలకు కోట్లు వెచ్చించినా ఆచరణలో సాధ్యం కాని పనిని స్థానిక పోలీసులు తొమ్మిదేళ్ల కిందటే సాధించారు. అప్పటి సిరిసిల్ల డీఎస్పీ దామెర నర్సయ్య, సిరిసిల్ల టౌన్ సీఐ విజయ్‌కుమార్ ప్రేరణతో గ్రామస్తులు ఉత్సాహంగా అక్షరాలను కళ్లకద్దుకున్నారు. 2014లో మూడు నెలల్లోనే ఆ పల్లె ప్రజలు అక్షరాస్యులుగా 'సాక్షి' సంతకాలు చేశారు.



అక్షరాలు పెట్టిస్తున్న దామెర నర్సయ్య (ఫైల్)

అక్షరాలు నేర్పిన రాత్రిబడి

ఊరి జనాభా 1,050 ఉండగా.. చదువు రాని వారు 154 మంది ఉన్నట్లు సర్వేలో గుర్తించి రాత్రిబడి ఏర్పాటు చేశారు. ఐదుగురు నిరక్షరాస్యులకు ఒక్కో విద్యావంతుడు అక్షరాలు దిద్దించే బాధ్యత అప్పగించారు. రోజు రాత్రి 7 నుంచి 8 గంటల వరకు అక్షరాలు దిద్దించారు. 2014 సెప్టెంబర్ 5న సర్దాపూర్‌లో సంపూర్ణ అక్షరాస్యతకు శ్రీకారం చుట్టారు. సరిగ్గా మూడు నెలల వ్యవధిలో జగ్గారావుపల్లెలోని 154 మందికి అక్షరాలు నేర్పించారు.

పోలీసు 'ప్రేరణ'తో

అప్పటి సిరిసిల్ల డీఎస్పీ దామెర నర్సయ్య, అప్పటి సిరిసిల్ల టౌన్ సీఐ విజయ్‌కుమార్ ఆ ఊరిని సంపూర్ణ అక్షరాస్యత గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. గ్రామస్తులతో మాట్లాడి రాత్రిబడి ఏర్పాటు చేశారు. చదువు విలువ అర్థమయ్యేలా వివరించేందుకు ప్రేరణ పేరుతో కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్వయంగా డీఎస్పీ జగ్గారావుపల్లెలో రాత్రి బస చేసి చదువు నేర్పించేందుకు బాటలు వేశారు. విద్యావంతులైన స్థానిక యువకులను, మహిళలతో చదువురాని వారికి అక్షరాలు నేర్పించే బాధ్యతలు అప్పగించారు. పలక, బలపాలు పోలీసులే సమకూర్చారు. డీఎస్పీ, సీఐలు తరచూ సందర్శిస్తూ రాత్రిబడి కొనసాగేలా పర్యవేక్షించారు.

'ఈచ్‌వన్.. టీచ్‌వన్' ఫెయిల్

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా ప్రభుత్వం 'ఈచ్‌వన్.. టీచ్‌వన్' పేరుతో 2020లో సర్వే చేసింది. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతోపాటు 255 గ్రామాల్లో 49,977 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో పురుషులు 13,400, మహిళలు 36,577 ఉన్నారు. జిల్లాలో అక్షరాస్యులు 3,15,611 మంది ఉన్నట్లు 2011 జనాభా లెక్కల ప్రకారం వెల్లడైంది. ఇందులో పురుషులు 1,82,946, మహిళలు 1,32,665 మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యులు 2,36,706 మంది ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో 78,905 మంది ఉన్నట్లు తేలింది. 2020లో జిల్లాలో నిరక్షరాస్యుల కోసం 'ఈచ్ వన్.. టీచ్ వన్' చేపట్టారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాలను భాగస్వాములను చేశారు. పల్లెప్రగతి సర్వేలోనూ నిరక్షరాస్యులను గుర్తించారు. కానీ కసరత్తులన్నీ కార్యరూపం దాల్చలేదు. 'ఈచ్ వన్.. టీచ్ వన్' ఫెయిల్ కాగా.. పోలీసుల చొరవతో జగ్గారావుపల్లె అక్షరాలను దిద్ది ఆదర్శంగా నిలిచింది.

నెలరోజుల్లో రాయడం నేర్చుకున్న



తొమ్మిదేళ్ల కిందట నెల రోజులు రాత్రి బడికి పోయి సంతకం నేర్చుకున్న. ఒకటి, రెండు అంకెలు గుర్తు పడతాను. అంతకు ముందు చదువురాదు. వేలిముద్ర వేసేదాన్ని. ఇప్పుడు సంతకం చేస్తున్నా. – బుర్ర లక్ష్మి, కూలి,జగ్గారావుపల్లె

గిప్పుడు సదువేంది అన్నరు



చాలా మంది గిప్పుడు సదువేంది అన్నారు. మొదట్లో నిరాశపడ్డాను. పోలీసుల సహకారంతో ఇది సాధ్యమైంది. అప్పటి డీఎస్పీ దామెర నర్సయ్య, సీఐ విజయ్‌కుమార్ సార్ల చొరవతో అందరూ సంతకాలు నేర్చుకున్నారు. – ఒజ్జెల అగ్గిరాములు,మాజీ సర్పంచ్

నేరరహిత గ్రామంగా తీర్చిదిద్దాలని..



నేరరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కొన్నింటిని ఎంపిక చేశాం. నేరాల చిట్టా పరిశీలించి కొన్ని కేసులు తొలగించాం. అదే క్రమంలో జగ్గారావుపల్లెలో రాత్రి బడి ఏర్పాటుచేశాం. చదవడం, రాయడం, సంతకాలు చేయడం నేర్పించాం. అది సక్సెస్ కావడం సంతోషంగా ఉంది. – దామెర నర్సయ్య, మాజీ డీఎస్పీ, సిరిసిల్ల

క్లుప్తంగా

ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: పద్మశాలీల ఆత్మగౌరవానికే తమ సామాజికవర్గ సంఘం పట్టణాధ్యక్షుడు ప్రాధాన్యతనివ్వాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. నూలు పౌర్ణమి రోజున పద్మశాలీ నేతలను అసభ్య పదజాలంతో దూషించిన వారితో క్షమాపణలు చెప్పించాలని, లేకుంటే శుక్రవారం వరకు కులసంఘం అధ్యక్షుడు తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఎనగంటి నరేశ్, ఊరగొండ రాజు, గాజుల సదానందం, రామకృష్ణ, సన్ని, రాజు, యాదగిరి ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్‌లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బొప్పాపూర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, డైరెక్టర్లు బండ సతీశ్, బొమ్మనవేణి సత్యంలను గురువరం బొప్పాపూర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ, వారి కష్టనష్టాల్లో భాగస్వామిగా నిలుస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలకు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం కులస్తులు బొమ్మనవేణి నారాయణ, నిమ్మల కిషన్, తమ్మనవేని సత్యం, యూత్ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో పేకాట శిబిరంపై దాడి

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని మల్కాపూర్‌లో పేకాట శిబిరంపై దాడి చేసి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ గురువారం తెలిపారు. గ్రామ శివారులో పందెం కాస్తూ పేకాటాడుతున్నారన్న సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

జిల్లా మత్స్యశాఖ సభ్యులకు సన్మానం



మత్స్యశాఖ సభ్యులను సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో గురువారం జిల్లా మత్స్యశాఖ పాలకవర్గ సభ్యులను ముదిరాజ్ కులస్తులు సన్మానించారు. మత్స్యశాఖ జిల్లా చీఫ్ ప్రమోటర్‌గా ఎన్నికైన చొప్పరి రామచంద్రం, డైరెక్టర్లు శివకుమార్, పిట్టల మోహన్, ఎల్లారెడ్డిపేట ఉమ్మడి మండలం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జజ్జరి నాగరాజును సన్మానించారు. చీఫ్ ప్రమోటర్ రామచంద్రం మాట్లాడుతూ బొప్పాపూర్‌లో ముదిరాజ్‌కు సొసైటీ ఏర్పాటు, ఇక్కడ ఉన్న రెండు చెరువుల్లో వాటాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దండు శ్రీనివాస్, నిమ్మల మోహన్, జజ్జర బాలనర్సు, గొడుగు నర్సయ్యలను సైతం సన్మానించారు. కార్యక్రమంలో తమ్మనవేని సతీశ్, బొమ్మనవేణి నారాయణ, నిమ్మల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు 'సహకారం'

- సాగు నుంచి మార్కెటింగ్ దాకా అన్నీ తామై..
- తోడ్పాటుగా నిలిచేందుకు టెస్కాబ్, బాయర్ ప్రణాళిక
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో నాలుగు సంఘాలు ఎంపిక
- సింగిల్‌విండోలకు ప్రత్యేకాధికారులు



ముస్తాబాద్(సిరిసిల్ల): ఆరుగాలం శ్రమిస్తున్న అన్నదాతలు పంటలు పండిస్తున్నారే తప్ప.. మార్కెటింగ్ చేసుకుంటూ లాభాలు గడించడం లేదు. ఏటా బొటాబోటి ఆదాయంతో నెట్టుకొస్తున్నారు. రైతులు లాభాలు పొందేలా.. గిట్టుబాటు ధరలు కల్పించేందుకు టెస్కాబ్, ఫర్టిలైజర్ కంపెనీ బాయర్, మాస్టర్‌కార్డు, నెదర్లాండ్స్ రాబో బ్యాంక్‌లు సంయుక్తంగా ముందుకొచ్చాయి. టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు ఆలోచనలతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను, రాష్ట్ర వ్యాప్తంగా 16 సహకార సంఘాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు.

ఆన్‌లైన్‌లో పంటల ధరలు

ఎంపిక చేసిన సహకార సంఘాల పరిధిలోని రైతులకు టెస్కాబ్ నియమించిన ప్రత్యేకాధికారులు అండగా ఉంటారు. నేల స్వభావం, ఏ రకమైన పంటలు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చో వారు తెలియజేస్తారు. విత్తనాల నుంచి యూరియా, పెస్టిసైడ్స్ అందిస్తూ సాగులో సహకారం అందిస్తారు. పత్తి, వరి, మిర్చి, కూరగాయలు, మామిడి, మొక్కజొన్న పంటల సాగుతో సాధించిన దిగుబడుల వివరాలను రైతుల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లలో..

దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ధర ఉందో తెలుసుకుని.. రైతులకు సమాచారం అందిస్తారు. ధాన్యానికి బెంగాల్‌లో అధిక ధర వస్తుందనుకుంటే.. అక్కడ మార్కెటింగ్, రవాణాను టెస్కాబ్, బాయర్ సంస్థలు చూసుకుంటాయి. కోల్డ్‌స్టోరేజీలలో పంట దిగుబడులను నిల్వ చేసుకుని.. మంచి ధర ఉన్నప్పుడే విక్రయించుకునే వెసులుబాటు కల్పిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో ఎక్కడ డిమాండ్ ఉంటుందో తెలుసుకొని.. అక్కడే రైతుల ఉత్పత్తులను విక్రయించేందుకు తోడ్పాటును అందిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో నెదర్లాండ్‌లోని రాబో బ్యాంక్, మాస్టర్‌కార్డు సంస్థలు పనిచేస్తాయి. ఆన్‌లైన్ సేవలతో రైతన్నలకు వెన్నంటి ఉండే సహకారాన్ని సింగిల్‌విండోలు, టెస్కాబ్, బాయర్ చూసుకుంటాయి.

పైలట్ ప్రాజెక్టుగా అమలు

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రైతు ఉత్పత్తులకు డిమాండ్ కల్పించే దిశగా ఎంపికచేసిన పైలట్ ప్రాజెక్టుకు నాలుగు సహకార సంఘాలను ఎంపిక చేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పోతుగల్, గంభీరావుపేట, కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి, జగిత్యాల జిల్లాలోని పోరండ్ల సహకార సంఘాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 16 సంఘాలను ఎంపిక చేశారు. ఇప్పటికే టెస్కాబ్ నియమించిన నిపుణులు ఆయా సహకార సంఘాలకు చేరుకున్నారు. వారు స్థానికంగా ఉంటూ సహకార సంఘాల అధికారులు, ఉద్యోగులకు సెప్టెంబర్ 12 నుంచి ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

పంట ఉత్పత్తులకు ధర వస్తుంది



టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు కృషితో సహకార సంఘాల పరిధిలోని రైతులకు మంచి రోజులు వస్తున్నాయి. అన్నదాతలు పండించిన ఉత్పత్తులకు అంతర్జాతీయస్థాయిలో విక్రయించుకునే అవకాశం కల్పిస్తారు. విత్తనాల నుంచి పంటల విక్రయాల వరకు రాబో, మాస్టర్‌కార్డు, టెస్కాబ్ చూసుకుంటాయి.

– తన్నీరు బాపురావు, చైర్మన్, పోతుగల్ సింగిల్‌విండో

అన్నదాతలకు మేలు



నష్టాల బారిన పడ్డ సింగిల్‌విండోను లాభాల బాటలోకి తీసుకొచ్చిన టెస్కాబ్ ఇప్పుడు అదే రైతులకు జాతీయ స్థాయిలో గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ఒకప్పుడు అంజుమాన్ పేరు చెబితే హడలిపోయిన రైతన్నలకు సహకార సంఘాలు బాసటగా నిలవడం వెనుక రవీందర్‌రావు కృషి ఉంది.

– అక్కరాజు శ్రీనివాస్, చైర్మన్ ఏఎంసీ, పోతుగల్

ప్రపంచ మార్కెట్‌లో తెలంగాణ ఉత్పత్తులు



తెలంగాణలో కోటి ఎకరాల మాగాణి ఉంది. సాగుజలాలు పుష్కలంగా ఉన్నాయి. సాగు విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో రైతుల ఉత్పత్తులకు విశ్వవిపణిలో మంచి మార్కెటింగ్ కల్పించేందుకు చర్యలు చేపట్టాం. సీఎం కేసీఆర్ కృషితో చేపట్టిన పైలట్ ప్రాజెక్టుతో రైతులు ఎక్కడైన తమ పంటలను విక్రయించుకునే అవకాశాలు కల్పిస్తున్నాం.

– కొండూరు రవీందర్‌రావు, టెస్కాబ్ చైర్మన్

అభివృద్ధిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకనే కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ విమర్శించారు. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండానే ఎగురుతుందన్నారు. వేలాది కోట్లతో ఆరు మండలాల్లోని గ్రామాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కొందరు నాయకులు బీఆర్ఎస్‌లో తొమ్మిదేళ్ల పదవులను అనుభవించి ఇప్పుడు వేరే పార్టీల్లోకి వెళ్తున్నారని, తమకు ప్రజలు అండగా ఉన్నారన్నారు. అనంతరం ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న మండలంలోని ముస్కాన్‌పేటకు చెందిన ఏఎంసీ డైరెక్టర్ సింగిరెడ్డి రాజిరెడ్డిని పరామర్శించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఏఎంసీ మాజీ చైర్మన్ వేణురావు, సర్పంచులు పొన్నం పర్శరాములు, కట్ట వెంకట్‌రెడ్డి, ముత్యం అమర్, ఎంపీటీసీలు సావనపెల్లి వనజ, ఒగ్గు నర్సయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతులకు న్యాయం

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

కోనరావుపేట(వేములవాడ): కాంగ్రెస్‌తోనే రైతులకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, అమలుచేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. గతంలో చేసిన విధంగా ఒకే సారి రూ. 2 లక్షల రుణమాఫీ, గ్యాస్ సిలిండర్ రూ. 500లకే అందిస్తామన్నారు. పార్టీ గ్రామాధ్యక్షుడు నంద్యాడపు సాగర్, నాయకులు సాసాల మల్లారెడ్డి, ఎల్లాల రాంరెడ్డి, శ్రీనివాస్, నార్ల ప్రేమ్‌చంద్, జూకంటి మల్లేశం, తీపిరెడ్డి వేణురెడ్డి, రాజిరెడ్డి, గుమ్మడి అమృతరావు, బడుగు మల్లయ్య, బాలయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి చావుదెబ్బే

సిరిసిల్లటౌన్: వచ్చే ఎన్నికల్లో బీజేపీకి చావుదెబ్బ తప్పదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో గురువారం భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించేందుకు గతేడాది సెప్టెంబర్ 7న రాహుల్‌గాంధీ కాశ్మీర్ టు కన్యాకుమారి వరకు చేపట్టిన ×భారత్ జోడో యాత్ర¤తో బీజేపీలో వణుకు పుట్టిందన్నారు. భారతీయులను ఏకం చేయాలన్న రాహుల్‌గాంధీ స్ఫూర్తితో దేశ ప్రజలు ఆకర్షితులయ్యారన్నారు. దేశాభివృద్ధి, సమగ్రత కాంగ్రెస్‌తోనే సాధ్యమని ప్రజలు నిర్ణయానికి వచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, రాష్ట్ర నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, చీటీ ఉమేశ్‌రావు, సంగీతం శ్రీనివాస్, జిల్లా నాయకులు ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, సంగీతం శ్రీనాథ్, కళ్యాణ చక్రవర్తి, అశోక్ ఉన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ తెలంగాణచౌక్ వద్ద ఓ భవనంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ రాడ్‌కు గుర్తుతెలియని వ్యక్తి బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం అని తెలిపారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

ఇండియా పేరు తొలగించొద్దు

- జమిలి ఎన్నికలు సరికాదు
- ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేసే కుట్ర
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



అభివాదం తెలుపుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం దేశం పేరును ఇండియాగా తొలగించి భారత్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాలను విరమించుకోవాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లాకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల మూడో వారంలో పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి రాజ్యాంగ సవరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే రాజ్యాంగంలో ఇండియా.. అలాగే భారత్‌గాను దేశం పేరును వాడుకలో ఉంచేలా రాజ్యాంగంలో పొందుపర్చారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జమిలి ఎన్నికల అంశాన్ని బీజేపీ వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చిందన్నారు. జమిలి ఎన్నికల నిర్వహణకు బీఎస్పీ వ్యతిరేకమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేసి రాష్ట్రాల్లో ప్రాంతీయపార్టీల ప్రాబల్యాన్ని తగ్గించాలన్న లక్ష్యంతోనే జమిలి అంశాన్ని ముందుకు తెచ్చారని అన్నారు. ఆయన వెంట నాయకులు దాసరి హనుమయ్య, దాసరి ఉష, రాజు, వెంకటేశ్, రియాజ్ తదితరులున్నారు.

కమీషన్లతో నాసిరకం పనులు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం



బుంగపడ్డ కల్వర్టును పరిశీలిస్తున్న సత్యం

బోయినపల్లి(చొప్పదండి): అధికారుల పర్యవేక్షణ కరువవడం.. రాజకీయ నాయకులకు కమీషన్లు ముట్టడంతోనే కల్వర్టు పనులు నాసిరకంగా చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం ఆరోపించారు. బోయినపల్లి నుంచి మర్లపేట వెళ్లే దారిలో బుంగపడ్డ కల్వర్టును స్థానిక నాయకులతో కలిసి గురువారం పరిశీలించి మాట్లాడారు. ఇక్కడి కల్వర్టు ఏటా వర్షాకాలంలో తెగిపోతుంటే శాశ్వత పనులు చేపట్టడంపై ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ప్రశ్నించారు. నాలుగు నెలల క్రితం మరమ్మతులు చేయడంపై ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, పార్టీ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, కట్ట లక్ష్మణ్, బోయిని ఎల్లేశ్, ముదాం శ్రీనివాస్, నిమ్మ వినోద్‌రెడ్డి, నక్క శ్రీకాంత్, ఆకుల అజయ్, గంగిపెల్లి లచ్చయ్య, ఎండీ రఫీ ఉన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు రామానుజమ్మ

- మలేషియాలో జరిగే పోటీలకు హాజరు
- 70 ఏళ్ల విభాగంలో తలపడనున్న సిరిసిల్ల బామ్మ



టమటం రామానుజమ్మ

సిరిసిల్ల: జిల్లా కేంద్రానికి చెందిన టమటం రామానుజమ్మ(70) అంతర్జాతీయ స్థాయిలో జరిగే మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు హాజరుకానుంది. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఈనెల 16, 17 తేదీల్లో జరిగే 35వ ఇంటర్నేషనల్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుంది. 50 కిలోలు.. 70 ఏళ్ల విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెంలో తలపడనుంది. ఇటీవల హర్యానాలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని రెండు బంగారు, ఒక వెండి పతకం సాధించింది. జాతీయస్థాయిలో 70 ఏళ్ల విభాగంలో రాణించిన రామానుజమ్మను అంతర్జాతీయ పోటీలకు దేశం తరఫున ఎంపిక చేసినట్లు నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఇండియా సెక్రటరీ జనరల్ రాంపాల్‌శర్మ గురువారం ప్రకటించారు. పరుగుపందెంలో అంతర్జాతీయ పోటీలకు ఎంపికవడంపై రామానుజమ్మ మాట్లాడుతూ తనకు సహకరించిన తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు మర్రి లక్ష్మారెడ్డి, ప్రభుకుమార్‌గౌడ్, కల్లెం మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చీటీ నర్సింగరావు, కార్యదర్శి గొట్టెముక్కుల శేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సిరిసిల్ల వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

గెజిట్ పబ్లికేషన్‌పై ఉత్కంఠ తొలగేనా?

- నేడు దేశాయిపల్లిలో పీడీఎఫ్‌ల ఎంపిక గ్రామసభ
- ఏడాదిగా కొలిక్కిరాని ఆర్అండ్ఆర్ వ్యవహారం

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం అదనపు టీఎంసీ వరదకాల్వ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న మండలంలోని దేశాయిపల్లిలోని కుటుంబాల గెజిట్ ప్రచురణపై ఉత్కంఠకు తెరపడనుందా? లేదా? నేడు జరిగే గ్రామసభతో తేలనుంది. వరదకాల్వలో గ్రామంలోని కొన్ని ఇళ్లు, కొట్టాలు ముంపునకు గురవుతున్నాయి. గతంలోనే ఇంటింటికెళ్లి అధికారులు సోషల్ ఎకానమిక్ సర్వేచేశారు. గతేడాది మార్చిలో, ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండు సార్లు నిర్వహించిన గ్రామసభ నిర్వాసితుల ఆందోళనల మధ్య ముగిసింది. శుక్రవారం గ్రామసభ నిర్వహించున్నట్లు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

140 మందితో గెజిట్ జాబితా ?

గతంలో రెండుసార్లు నిర్వహించిన గ్రామసభ ఎటూ తేలకుండానే ముగిసింది. అప్పుడు 144 పీడీఎఫ్‌లతో ప్రాథమిక జాబితా రూపొందించినట్లు తెలిసింది. ఇప్పుడు అందులో నుంచి నాలుగుపేర్లు తొలగించి 140 పేర్లతో తుదిజాబితా తయారు చేశారంటున్నారు. నిర్వాసితులలో కొందరు ఆర్అండ్ఆర్‌కాలనీ కావాలని, మరికొందరు వన్ టైం సెటిల్‌మెంట్ కింద డబ్బులు కావాలని కోరుతున్నారు.

గ్రామ సభనా? అధికారుల జాబితానా?

అధికారులు మొదట 144 మందితో జాబితా తయారుచేయగా, ఇప్పుడు 140 మంది పేర్లు మాత్రమే ఫైనల్ అయ్యాయని ప్రచారంలో ఉంది. గ్రామసభలో గెజిట్ ఫైనల్ చేస్తారా? లేదా? లనే విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పక్క గ్రామంలో నివసిస్తున్న వారి పేర్లు సైతం జాబితాలో ఉన్నట్లు చర్చ సాగుతుంది. గతంలో గ్రామసభ జరిగిన రెండు సందర్భాల్లో ఏకాభిప్రాయం కుదరక జాబితా ఫైనల్ కాలేదు. ఇప్పుడు పేర్లు చదివి రెండు రోజులు అభ్యంతరాలకు సమయమిచ్చి గెజిట్ ఫైనల్ చేయాలని చూస్తున్నారని ప్రచారంలో ఉంది. రాజీమార్గాన గ్రామసభ నిర్వహించి గెజిట్ ఫైనల్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇళ్లు కోల్పోతున్న ఒక్కో నిర్వాసిత కుటుంబానికి రూ.6.60లక్షల పరిహారం, ఆర్అండ్ఆర్‌కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.1.25 లక్షలు, 75 గజాల మేర స్థలం ఇవ్వనున్నట్లు గతంలో అధికారులు తెలిపారు. ఇళ్లు ముంపునకు గురవుతున్న వారికి ప్రభుత్వపరంగా మంచి సాయం అందే అవకాశం ఉంది. గెజిట్‌లో పేరు ఉన్న పీడీఎఫ్‌లకు పై ప్యాకేజీలు వర్తిస్తాయి.

'రాష్ట్రంలో అధికారంలోకి రాబోతున్నాం'



ఇల్లంతకుంట(మానకొండూర్): తెలంగాణలో బీఆర్ఎస్ పాలనకు ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెప్పబోతున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని రేపాక, తాళ్లపల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు వేసి ఆహ్వానించారు. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, పాశం రాజేందర్‌రెడ్డి, వినయ్‌కుమార్, పసుల వెంకటి, గుర్రం భూపతిరెడ్డి, మల్లేశం, లక్ష్మణ్, జమాల్ ఉన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



సిరిసిల్లటౌన్: నిత్యావసరాల ధరలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ మాట్లాడుతూ కేంద్ర సర్కారు లోపభూయిష్ట విధానాలతోనే నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయన్నారు. నిరుద్యోగులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ రెండుకోట్ల ఉద్యోగాలను అమలు చేయాలని కోరారు. గ్యాస్ సిలిండర్ ధరను రూ.800 పెంచి.. ఇప్పుడు రూ.200 తగ్గించి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, సూరం పద్మ, శ్రీరాం సదానందం, అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, గోవిందు లక్ష్మణ్ పాల్గొన్నారు.

జిల్లాలో తుంపర వాన

సిరిసిల్ల: జిల్లాలో గురువారం మోస్తరు వర్షం కురిసింది. చలిగాలులు వీస్తున్నాయి. అత్యధికంగా ఎల్లారెడ్డిపేట మండలంలో 39.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా రుద్రంగిలో 4.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చందుర్తిలో 6.1, వేములవాడ రూరల్‌లో 8.9, బోయినపల్లిలో 8.6, వేములవాడలో 26.6, సిరిసిల్లలో 22.0, కోనరావుపేటలో 24.2, వీర్నపల్లిలో 22.0, గంభీరావుపేటలో 25.9, ముస్తాబాద్‌లో 34.2, తంగళ్లపల్లిలో 17.9, ఇల్లంతకుంటలో 24.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో అన్ని మండలాల్లో కలిపి సగటు వర్షం 20.4 మిల్లీమీటర్లుగా నమోదైంది.

మల్కపేట రిజర్వాయర్‌కు నర్సయ్య పేరు పెట్టాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే కర్రెల నర్సయ్య పేరును మల్కపేట రిజర్వాయర్‌కు పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నిజాంలు, దేశాయిలపై పోరాడిన యోధుడుగా నర్సయ్యను పేర్కొన్నారు. పంతం రవి, మంచికట్ల రమేశ్, సోమ నాగరాజు, చంద్ర, బాలరాజు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటు చేయాలి

మల్కపేట రిజర్వాయర్‌కు బడుగు, బలహీన వర్గాల నేత, మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలని మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లోవిలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుకు పేరు పెట్టడంతోపాటు సిరిసిల్లలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. వెంకటి, నర్సయ్య, భాస్కర్, జాన్, జొనాథన్ ఉన్నారు.

ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు.. వ్యక్తిపై ఫిర్యాదు

కోనరావుపేట(వేములవాడ): డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ వెంకి పటేల్ పేరుతో ఉన్న అకౌంట్ ద్వారా డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావులపై అనుచిత వ్యాఖ్యలు పెట్టారన్నారు. ఇద్దరి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, మంగిలిపల్లి శంకర్, రాస రవీందర్‌రెడ్డి, వెంకన్న, ప్రదీప్, మాజీ జెడ్పీటీసీ గొట్టె రుక్మిణి తదితరులు ఉన్నారు.

గడప గడపకు ధర్మసమాజ్

- డీఎస్పీ జిల్లా ధర్మ ప్రచారక్ పరమేశ్వరీ



ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న పరమేశ్వరీ

ముస్తాబాద్(సిరిసిల్ల): గడప..గడపకు ధర్మసమాజ్ పార్టీని తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా ధర్మప్రచారక్ కేసుగాని పరమేశ్వరీ కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో మూడు కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకు ధర్మ సమాజ్‌పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. అణగారినవర్గాల రాజ్యాన్ని నిర్మించేందుకు అందరూ కలిసి రావాలని కోరారు. వేముల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.